క్లుప్తంగా

నేడు మహ్మదాపురంలో 'గడప గడపకు..'

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు వరుసగా రెండో రోజు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొంటారని సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. అనంతరం తోడేరు సచివాలయ పరిధిలోని రత్నగిరి, శాంతి నగర్ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు.

12న మండల సమావేశం

ముత్తుకూరు : ముత్తుకూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 12న జరుగుతుందని ఎంపీడీఓ ప్రత్యూష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



ఇందుకూరుపేట : మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ జర్నలిస్టు గవిని చక్రపాణి జ్ఞాపకార్థం కుమారుడు, సాయిరాం ఇంగ్లిష్ మీడియం స్కూల్ అధినేత పాలేంద్ర జగదీష్‌బాబు, కుమార్తె రాధారాణి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, కొత్తూరు లలితా మహేశ్వరీ ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి ప్రారంభించారు. ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు, డీటీ బషీర్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ



విచారణ చేస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

ఇందుకూరుపేట : కరోనా రక్షక్ కవచ్ అక్రమాలపై కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. ఇందుకూరుపేట సచివాలయ మహిళా పోలీస్ విజయలక్ష్మి అవినీతికి పాల్పడినట్లు డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, సచివాయల సిబ్బంది ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటరాజేష్‌తో కలిసి విచారించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ విచారించారు.

ఈఓపీఆర్డీ రమణయ్యకు డీఎల్‌పీఓగా పదోన్నతి



మనుబోలు : మండలంలో పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ పుట్టా రమణయ్యకు ఉన్నతాధికారులు డీఎల్‌పీఓగా పదోన్నతి కల్పిస్తూ పల్నాడు జిల్లా నరసారావుపేటకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మనుబోలు పంచాయతీ కార్యదర్శి ఆత్మకూరు వెంకటరమణయ్యకు బాధ్యతలు అప్పగించారు. పదోన్నతి పొందిన రమణయ్యను సోమవారం పలువురు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు అభినందించారు.

విచారణ జరిపించండి



ఎస్సై వీరపత్రాప్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిలో మార్చి 14న అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన శానంపూడి మాల్యాద్రి మృతిపై విచారణ జరపాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నరసింహులు కోరారు. ఈ మేరకు బుచ్చి ఎస్సై వీరప్రతాప్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం నరసింహులు మాట్లాడుతూ మాల్యాద్రి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేశారని, అయితే కేసు ముందుకు సాగడం లేదని వివరించారు.

గుర్తించిన సమస్యలకు వేగంగా పరిష్కారం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యను అధికారుల ద్వారా వేగంగా పరిష్కరిస్తామని, సర్వేపల్లి నియోజకవర్గంలో కార్యక్రమం పూర్తి కావచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మహ్మదాపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి కాకాణి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేయడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డుపై రెండో పింఛన్ మంజూరు చేసేందుకు సీఎం జగన్ చొరవ తీసుకున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అన్నివిధాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహ్మదాపురంలో రూ.2.77 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం శిలాఫలకాల ఏర్పాటుకే పరిమితమైందని, కాగితాలపైనే అభివృద్ధి కనిపించేదని పేర్కొన్నారు. వారు వేసిన శిలాఫలకాలకు తాము నిధులు ఇచ్చి పనులు పూర్తి చేసినట్లు తెలియజేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న రోడ్లు, సైడ్‌డ్రెయిన్లు, వాటర్ ట్యాంకులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల కోలాటం ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో డీపీఓ సుస్మితారెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఏఈలు కసనానాయక్, శివమోహన్, ప్రసాద్, విద్యుత్ ఏడీఈ సురేంద్రబాబు, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ సుబ్బరాయుడు, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ ప్రత్యూష, ఉప సర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి, పి.అశోక్‌కుమార్‌రెడ్డి, బి.మాలకొండారెడ్డి, జి.తిరుపాల్‌రెడ్డి, కె.రమణారెడ్డి, పి.చెంచుకృష్ణారెడ్డి, పి.లచ్చారెడ్డి, పి.పోలిరెడ్డి, డి.వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

- పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

వెంకటాచలం : గణితశాస్త్ర ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ సూచించారు. వెంకటాచలం మండలం గొలగమూడిలో భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమ పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్సు సమన్వయకర్త డాక్టర్ పి.రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదుచోట్ల ఐదు విభాగాల్లో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని తెలియజేశారు. ఇక్కడ తెలుసుకున్న విషయాలను వారివారి జిల్లాల్లో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమాల్లో శిక్షకులుగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పరిశీలకుడు కె.శ్రీనివాస్, సమగ్ర శిక్ష ఏపీఓ జి.సుధీర్‌బాబు, పలువురు సీనియర్ అధ్యాపకులు, శిక్షకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న నిర్వాహకులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవస్థానం నిర్వాహకులు ఆహ్వాన పత్రికలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పట్టణ, గ్రామాల్లో పర్యటిస్తూ ఈనెల 12 నుంచి 18వ తేదీ జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరారు. దాసరి శ్రీనివాసులు, చొప్పి వెంకటేశ్వర్లు, కొమ్మి వేణుగోపాల్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు



కోవూరు : మాట్లాడుతున్న రాధాకృష్ణారెడ్డి



కొడవలూరు గ్రంథాలయంలో..

కోవూరు : గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు జరుగుతుందని ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి తెలిపారు. కోవూరు గ్రంథాలయంలో సోమవారం వేసవి శిబిరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

– కోవూరు (కొడవలూరు) : కొడవలూరు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌ను లైబ్రేరియన్ చింతల రాజేశ్వరి సోమవారం ప్రారంభించారు. యువత వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు.

విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

మనుబోలు : పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో మే 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మనుబోలు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు (సమ్మర్ క్యాంప్) నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు శిబిరంలో విద్యార్థుల చేత కథలు చదివించి వాటిని వారితోనే చెప్పించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలను విశ్లేషించడం, చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే చెస్, క్యారమ్స్‌లలో పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఆట విడుపుగా సమ్మర్ క్యాంపులు ఉపకరిస్తాయన్నారు.

జూన్ 11 వరకు శిక్షణ

ఇందుకూరుపేట : మండలంలోని ఇందుకూరుపేట శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లైబ్రేరియన్ నాగరాజు మాట్లాడుతూ జూన్ 11 వరకు శిక్షణ శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. పుస్తక పఠనం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, పేపర్ ఆర్ట్ తదితర అంశాలపై చిన్నారులకు శిక్షణ ఇస్తామని చెప్పారు.



మనుబోలు : పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు



ఇందుకూరుపేట : శిక్షణకు హాజరైన విద్యార్థులు

వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన అయ్యప్ప గుడి ఫ్లైఓవర్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. శ్రీకాకుళం జిల్లా పలాసాకు చెందిన డీ వల్లభరావు అలియాస్ నారాయణ(51)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మనస్పర్థలతో భార్య విడిపోయి పిల్లలతో కలిసి చెన్నైలో ఉంటోంది. దీంతో వల్లభరావు కొన్నేళ్లకిందట ఉపాధినిమిత్తం నెల్లూరుకు వచ్చాడు. అయ్యప్పగుడి సమీపంలోని హాఫీజ్ టింబర్ డిపోలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఆయన ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. పలుమార్లు యజమాని మద్యం తాగొద్దని చెప్పినా పెడచెవిన పెట్టాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి ఆయన పూటుగా మద్యం సేవించాడు. సాయంత్రం అయ్యప్పగుడి ఫ్లైఓవర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గమనించి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను ఆరా తీయగా టింబర్ డిపోలో పనిచేసే వల్లభరావు అని తేలింది. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. చెన్నైలోని భార్య పిల్లలకు సమాచారం అందించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ కాలనీలో మరో వ్యక్తి

రోడ్డు ప్రమాదమో.. ఎవరైనా దాడిచేసి గాయపరిచారో తెలియదు కానీ రెవెన్యూకాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాలు.. వీఎంఆర్‌నగర్‌కు చెందిన షేక్ సుభాని(39), అబీదా దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు. సుభాని పెయింట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి సుభాని తీవ్ర గాయాలతో రెవెన్యూకాలనీ ప్రాంతంలో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు భార్య అబిదాకు సమాచారం అందించారు. ఆమె హుటాహుటిన అక్కడికి చేరుకుని భర్తను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈమేరకు బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభావంతులకు సన్మానం



పొదలకూరు డీఎన్నార్ జెడ్పీహైస్కూల్లో..



బుచ్చిరెడ్డిపాళెం : సన్మానం అందుకున్న విద్యార్థులతో టీచర్లు, నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన రిహాన్ 583 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా, సాయి 582 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్, హెచ్‌ఎమ్ సుజాత, కౌన్సిలర్ జయంతి పాల్గొన్నారు.

నగదు బహుమతి

వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, పదో వార్డు కౌన్సిలర్ మల్లారెడ్డిలు మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.6 వేల చొప్పున, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.వెయ్యి నగదును అందజేశారు.

దివ్యాంగులకు..

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు దివ్యాంగ విద్యార్థులు పది పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో వారిని పాఠశాలలో హెచ్‌ఎం ఎంవీ చలపతిరావు ఆధ్వర్యంలో నాగతేజశ్వనీని తల్లి రజితతో కలిసి, శశిధర్‌ను తండ్రి మురళీతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సక్ష్యం న్యాయ సహాయక ప్రముఖ్ వినయ్‌కుమార్, కార్యకర్తలు బాలసుబ్రహ్మణ్యం, డి.మల్లికార్జున్‌రెడ్డి, రాములమ్మ, విజయ పాల్గొన్నారు.

- పొదలకూరు : స్థానిక డీఎన్నార్ జెడ్పీహైస్కూల్ విద్యార్థినులు పది పరీక్షల్లో ప్రతిభ కనపరిచి మండల టాపర్స్‌గా నిలవడంతో సోమవారం పాఠశాలలో వారిని ఘనంగా సన్మానించారు. 600 మార్కులకు 592, 584, 582 మార్కులు సాధించిన ఎ.వైష్ణవి, ఆర్.తేజస్విని, కోన సాయిభార్గవిలను ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ సురేఖ, హెచ్‌ఎం పెర్సిస్, వార్డుసభ్యుడు వాసుదేవరావు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : కొమరిక జెడ్పీహెచ్‌ఎస్‌లో..

రైలు పట్టాలపై మహిళ మృతదేహం

మనుబోలు : మనుబోలు రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. చెర్లోపల్లి రైల్వేగేటు వద్ద 143-29 కిలోమీటర్ల వద్ద అప్‌లైన్‌పై రైల్వే సిబ్బంది ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. మహిళ వయసు సుమారు 50 ఏళ్లు ఉండొచ్చని అంచనా.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోవూరు (కొడవలూరు): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన కొడవలూరు మండలంలోని చింతచెలికలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యల్లాయపాళేనికి చెందిన కర్రా శ్రీహరి(21) బైక్‌పై వెళ్తుండగా ఓ రొయ్యల ఫ్యాక్టరీకి సంబంధించిన బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీహరి అక్కడికక్కడే మృతిచెందాడు. కొడవలూరు ఎస్సై సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..



సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. కుటుంబ శుభకార్యం నేపథ్యంలో కావలిలో జరుగనున్న సీఎం వైఎస్ జగన్ సభకు హాజరు కావడం లేదని, ఈ మేరకు ఆయన అనుమతి కూడా తీసుకున్నట్లు తెలిపారు.

కనీస వేతనం రూ.272 పొందాలి

- డ్వామా పీడీ వెంకటరావు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటరావు

పొదలకూరు : ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు కనీస వేతనం రూ.272 పొందేలా పనులు చేసుకోవాల్సిందిగా డ్వామా పీడీ డి.వెంకటరావు సూచించారు. పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి సమీపంలో కూలీలు చెక్‌డ్యామ్ పనులను చేస్తుండగా ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్లను పరిశీలించి టీఏలు, ఎఫ్‌ఏలు కూలీలకు కనీస వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులను కల్పించాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పీడీ వెంట ఏపీఓ మధుసూదన్ ఉన్నారు.

సత్తాచాటిన క్రీడాకారులకు అభినందన



ప్రతిభ చూపిన విద్యార్థులతో వీసీ సుందరవల్లి, అధ్యాపకులు

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులను వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి సోమవారం సాయంత్రం అభినందించారు. వీఎస్‌యూ నిర్వహించిన 31 క్రీడల్లో 298 మంది ప్రాతినిధ్యం వహించారు. ఇందులో 25 మంది బాలురను, 15 మంది బాలికలను బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్లుగా ఎంపిక చేసి మొత్తం 40 మందికి రూ.3 వేల చొప్పున స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్ అందజేశారు. పురుషుల విభాగంలో గేమ్స్, అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ షిప్ కింద రూ.50 వేల నగదును వీఎస్‌యూ క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. అలాగే మహిళల విభాగంలో కావలి పీజీ సెంటర్ రూ.25 వేలు, మహిళల అథ్లెటిక్స్ విభాగంలో డీకేడబ్ల్యూ విద్యార్థులు రూ.25 వేల నగదు బహుమతి పొందారు. కార్యక్రమంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కె.సునీత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైమ్): భగత్‌సింగ్‌కాలనీ సమీపంలో జాతీయరహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన పలువురు చెన్నైలో వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం పది మంది తమ మినీ వ్యాన్‌లో ఒడిశాకు బయలుదేరారు. భగత్‌సింగ్‌కాలనీ వద్దకు రాగానే జాతీయరహదారిపైకి అకస్మాత్తుగా ఇసుక ట్రాక్టర్ రావడంతో మినీవ్యాన్ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ బీ రత్నాకర్, క్లీనర్ జానీ తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన 8 మందికి స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్, క్లీనర్లు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు ప్రథమచికిత్స చేయించుకుని వేరే వాహనంలో ఒడిశాకు బయలుదేరి వెళ్లారు. డ్రైవర్ రత్నాకర్ ఫిర్యాదు మేరకు నార్త్‌ట్రాఫిక్ పోలీసులు సోమవారం కేసు నమోదుచేశారు. ప్రమాదానికి కారణమైన ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

ఆటోడ్రైవర్ అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఊరెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఆటోడ్రైవర్ అదృశ్యమైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కొండాయపాళెంగేటు పాత మిలటరీకాలనీలో మున్నీరా, అలీఅహ్మద్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఓ పాప సంతానం. అలీఅహ్మద్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. తన అన్న పీలేరులో ఉంటున్నాడని, అక్కడి నుంచి మామిడికాయలు తెచ్చి అమ్మితే మంచి లాభాలు వస్తాయని ఆయన భార్యకు చెప్పాడు. ఈ నెల 5న పీలేరు వెళ్తున్నానని చెప్పి రూ.50 వేలు తీసుకెళ్లాడు. అప్పట్నుంచి అతని జాడ తెలియరాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. అతని ఆచూకీ కోసం గాలించినా జాడ తెలియరాలేదు. ఈ మేరకు మున్నీరా సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రౌడీషీటర్ల ఘర్షణ

నెల్లూరు(క్రైమ్) : ఇద్దరు రౌడీషీటర్లు ఘర్షణకు దిగి కత్తులతో దాడి చేసుకోవడంతో ఇరువురు గాయాలపాలయ్యారు. వివరాలు.. తడికెలబజార్‌కు చెందిన గుణ, యనమలవారిపాళేనికి చెందిన పీ తేజపై నవాబుపేట పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. గతంలో టీపీగూడూరు పరిధిలో చోటు చేసుకున్న ఓ గొడవ విషయమై కోర్టులో వారిపై కేసు నడుస్తోంది. ఆ కేసులో రీకాల్‌పెట్టించుకునే విషయమై ఇరువురు నవాబుపేట పరిధిలోని రాఘవ స్కూల్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం మాట్లాడుకుంటుండగా ఘర్షణ చెలరేగింది. అనంతరం ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేందుకు పరుగులు తీశారు. ఈ క్రమంలో కత్తులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో తేజకు తీవ్ర రక్తగాయాలతో బాలాజీనగర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి దాడి విషయాన్ని తెలియజేశారు. పోలీసులు ఆయన్ని హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. కాగా గుణ సైతం గాయాలతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. నవాబుపేట, బాలాజీనగర్ పోలీసులు విచారిస్తున్నారు.

బంగారు గొలుసు అపహరణ

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందే వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని యువకులు అపహరించుకెళ్లిన ఘటన ఏసీనగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు..నజీర్‌తోట షాదీమంజిల్ ప్రాంతంలో ఏ మహాలక్ష్మి, బాబు దంపతులు నివాసం ఉంటున్నారు. సోమవారం ఆమె ఏసీనగర్ చిన్నవినాయకగుడి సమీపంలో నివాసం ఉంటున్న తన అక్క ఇంటికి వెళ్లారు. అక్కడ కొద్దిసేపు గడిపిన అనంతరం ఇంటికి తీసుకెళ్లమని తన మనుమడికి ఫోన్‌చేసింది. మనుమడి కోసం అక్క ఇంటిముందు నిలిచి ఉండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు వృద్ధురాలి మెడలోని ఐదు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.